నేడు ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం

భీమవరం రూరల్ : అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, వసుధఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 17న మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆక్యుప్రెజర్ ద్వారా ఊబకాయం, సయాటికా, రక్తపోటు, మూత్రపిండాల వ్యాధులు, నిద్రలేమి, మధుమేహం, పక్షవాతం, మోకాళ్ల నొప్పులు, మానసిక వ్యాధులు, గ్యాస్ట్రిక్, శ్వాసకోశ వ్యాధులు, గొంతు, ముక్కు, చెవి తదితర సమస్యలకు చికిత్స లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి రోగి తప్పనిసరిగా ఆరు రోజులపాటు చికిత్స పొందాలని తెలిపారు. దీనికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.వంద చెల్లించాలని, మిగిలినవన్నీ ఉచితమేనని పేర్కొన్నారు.

సుందరయ్య భవనంలో మెడికల్ క్యాంప్‌లు, రెగ్యులర్ ఉచిత క్లినిక్ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తిరునాళ్లలా కోడి పందేలు

విచ్చలవిడిగా జూదం - జోరుగా మద్యం విక్రయాలు - చేతులు మారిన రూ.వందల కోట్లు

రెండు జిల్లాల్లో పండుగ పేరిట కోడి పందేలతోపాటు జూదాలు విచ్చలవిడిగా సాగాయి. ఈసారి అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పోటీపడి బరులు నిర్వహించడం విశేషం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద పందేలు సాగిన బరులుగా కాళ్ల మండలంలోని పెదఅమిరం, సీసలి బరులు నిలిచాయి. ఈ పందేల్లో ప్రముఖ నేతలు స్వయంగా పాల్గొనడం గమనార్హం. ఇక జూదాలతోపాటు మద్యం విక్రయాలు సైతం బరుల వద్దే పెద్దఎత్తున సాగడం అందరినీ విస్మయపర్చింది. మూడు రోజులు కానరాని పోలీసులు మంగళవారం సాయంత్రం మాత్రం ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం ప్రాంతంలో పందేలపై దాడులు నిర్వహించి హడావుడి చేశారు. జీలుగుమిల్లి మండలంలో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో జూదం శిబిరాలు మాత్రం యధావిధిగా కొనసాగడం చర్చనీయాంశమైంది.

ఆచంటలో కోడిపందేల జోరు

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి పండుగ మూడు రోజులు మండలంలో పెదఅమిరం, సీసలి గ్రామాల్లో భారీస్థాయిలో నిర్వహించిన కోడి పందేలు తిరునాళ్లలా నిర్వహించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో టెంట్లో, పేకాట శిబిరాలు, గుండాట, క్యాసినో బోర్డులు వేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు గ్రామాల్లో ఒకటి నుంచి రెండు బరులు ఏర్పాటు చేశారు. వినోదం పేరుతో గ్రామాల్లో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న జూదాల్లో సుమారు మూడు రోజుల్లో రూ.వంద కోట్ల వరకూ చేతులు మారాయి. ఒక్కో కోడిపందెం లక్ష నుంచి రూ.19 లక్షల వరకు సాగడం గమనార్హం.

ఆచంట: కత్తి కట్టిన కోళ్ల పందెంలో సై అంటే సై అంటూ పోటీపడ్డాయి. ఈ మూడు రోజుల్లో నియోజకవర్గంలోని ఆచంట, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో భారీస్థాయిలో కోడిపందేలు సాగాయి. ఈ మూడు రోజులు పందేలు, గుండాట, కోతాట జోరుగా సాగిపోయాయి. అక్కడా ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి గ్రామంలో చిన్నపాటి బరుల్లో పందేలు సాగడం గమనార్హం.

నరసాపురం: సంక్రాంతి సందర్భంగా నరసాపురంలో పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించారు. పట్టణ శివార్లలోని లేఅవుట్లో పెద్దఎత్తున టెంట్లు వేసి పగటి పూటతోపాటు రాత్రి వేళల్లో కూడా ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు వేశారు. బరుల వద్ద జనాలను అదుపు చేసేందుకు బౌన్సర్లను సైతం ఏర్పాటు చేయడం విశేషం. కోడిపందేల పక్కనే గుండాట, కోతాట బోర్డులను ఏర్పాటు చేశారు. కొన్ని బరుల వద్ద పందెంరాయుళ్ల వీక్షకులకు ఇబ్బంది లేకుండా భారీ ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. బరుల వద్దే యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగాయి. బరులు వద్ద రాత్రి సమయాల్లో జనాన్ని ఆకర్షించేందుకు ఆర్కెస్ట్రాలను సైతం ఏర్పాటు చేశారు.

మొగల్తూరు: మండలంలో కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. మండల కేంద్రం మొగల్తూరులోనే సుమారు ఐదుచోట్ల పందేల బరులు ఏర్పాటు చేయడం విశేషం. వీటితోపాటు మండలంలో పేరుపాలెం, కెపి.పాలెం, కాళీపట్నం, ముత్యాలపల్లి, వారతిప్ప, రామన్నపాలెం తదితర గ్రామాలలో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద గుండాట బోర్డులను ఏర్పాటు చేశారు. జనం ప్రత్యేక వాహనాల్లో ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చారు.

ఉంగుటూరు: సంక్రాంతి సంప్రదాయం ముసుగులో మండలంలో మూడు రోజులపాటు కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ఫడ్‌లైట్లు, సినీసెట్టింగుల తరహాలో డెకరేషన్‌తో కూడిన పందిళ్లు, ప్రేక్షకులు వీక్షించేందుకు కుర్చీలతో సహా అన్నీ ఏర్పాట్లతో బరులు నిర్వహించడం గమనార్హం. నారాయణపురంలో పందేల బరుల వద్ద భారీ స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయడం గమనార్హం. లక్కీ డ్రా రూ.వెయ్యి టిక్కెట్ తీసుకున్న వారికి డ్రాలో ఇచ్చేలా బుల్లెట్ వాహనాన్ని ఉంచారు. బాదంపూడిలో ఫ్లడ్‌లైట్స్ నడుమ పెద్దసంఖ్యలో పందేలు సాగాయి. నారాయణపురం, కొత్త ఉంగుటూరు, చినవెల్లమిల్లి, రాచూరు, గొల్లగూడెం, కైకరంలో కోడి పందేలతోపాటు పేకాట విచ్చలవిడిగా జరిగాయి. అధికారపార్టీ ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందేలు నిర్వహించడం గమనార్హం. అలాగే టిడిపి నేతల ఆధ్వర్యాన పందేలు సాగాయి. ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సొంతూరుకు వచ్చిన వారు పందేలను తిలకించేందుకు రావడంతో రద్దీ మరింత పెరిగింది. గడిచిన ఏడాది కంటే ఈసారి శుక్రవారం, శనివారం సెలవు రోజులు కావడంతో హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి తెలుగు వారు సొంతూళ్లకు రావడంతో రద్దీ పెరిగిందని బస్సు టికెట్ ధరలు అధికంగానే ఉన్నట్లు ప్రయివేటు ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు.

పందేలపై పోలీసుల దాడులు

జీలుగుమిల్లి: మండలవ్యాప్తంగా పలుచోట్ల నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడులు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కామయ్యపాలెం, రాచన్నగూడెం, జీలుగుమిల్లి, తాటియాకులగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై హెడ్ కానిస్టేబుళు రాధాకృష్ణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,170 నగదు, నాలుగు కోళ్లు, నాలుగు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

జీలుగుమిల్లి: మండలంలో కోడిపందేలు విచ్చలవిడిగా నిర్వహించారు. మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేలకు జనాలు భారీగా తరలొచ్చారు. తెలంగాణలో పందేలు లేకపోవడంతో అక్కడి పందెంరాయుళ్లు కూడా సరిహద్దు గ్రామాల్లోకి రావడంతో పందేలు పెద్దఎత్తున సాగాయి.

ముసునూరు: కోడిపందేలు, పేకాట, జూదం, గుండాట మండలంలో విచ్చలవిడిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో సాగాయి. మండలంలోని 16 గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ పందేల్లో పాల్గొన్నారు. మద్యం, బిర్యానీ అమ్మకాలు సాగించారు.

టి.నరసాపురం: మండ లంలోని టి.నరసాపురం, బందంచర్ల, తిరుమలదేవిపేట, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో పందేల జోరు సాగింది. మండలంలో సుమారు కోటి రూపాయల వరకు చేతులు మారినట్లు పలువురు చెబుతున్నారు.

ముదినేపల్లి: మండలంలోని పేరూరు, ఈడేపల్లి, జానకిగూడెం, వడాలి, దేవపూడి, ముదినేపల్లి గ్రామాల్లో కోడి పందేలు జాతరను తలపించేలా సాగాయి. ఫుడ్ కోర్టులు, మద్యం, సిగరెట్లు. తినుబండారాల స్టాల్స్ విరివిగా వెలిశాయి. మరోవైపు కోడిపందెలతో పాటు పేకాట, గుండాట వంటి ఆటలు కూడా జోరుగా సాగాయి. పందేలను చూడడానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ పేరుతో కూడా పెద్దఎత్తున డబ్బు వసూలు చేశారు.

షర్మిల రాక ప్రభావం చూపేనా..!

రాజకీయ నేతల్లో చర్చ
పొత్తులపైనే ప్రభావమంటున్న విశ్లేషకులు

ప్రజాశక్తి - డెస్క్

అంతా అనుకున్నట్లుగానే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ముందు నుంచి దీనిపై ప్రచారం ఉన్నా, కాంగ్రెస్ అధిష్టానం అధికారిక ప్రకటనతో అటు రాజకీయ నేతలు, ఇటు జనంలో ఒకింత చర్చ నెలకొంది. అయితే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రభావం కోల్పోయిన కాంగ్రెస్‌కు షర్మిల నియామకం ఊపిరి పోస్తుందా, లేదా అని ఎడతెగని చర్చ సాగుతోంది.

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులే కరువయ్యారంటే రెండు జిల్లాల్లో ఆ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో అంటే 2004, 2009 ఎన్నికల్లో జిల్లాలో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ చేజిక్కించుకుంది. రాష్ట్ర విభజన అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల ముందే కొంతమంది వైసిపి గూటికి చేరగా కొంతమంది నేతలు స్తబ్దతగా ఉండిపోయారు. నాటి నుంచి నేటి వరకూ రెండు జిల్లాల్లో అక్కడక్కడా సంప్రదాయవాదులుగా పేరొందిన కొందరు కాంగ్రెస్ నేతల కదలికలే కన్పిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి, పాలకొల్లు ప్రాంతాలతోపాటు మరికొన్ని మండలాల్లో కొందరు వ్యక్తులుగానే కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఉండి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాత్రం ఏదోక కార్యక్రమం నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో కర్నాటక, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడున్న నేతల్లో కొంత ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో షర్మిల పిసిసి అధ్యక్షురాలిగా నియమితులు కావడంపై జిల్లాలో ప్రభావంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసిపి అధినేత జగన్‌ను షర్మిల ఇరుకున పెడతారా.. లేక తామే ఇరుక్కుపోతారా అనేది పొత్తుల వ్యవహారం బట్టి ఉంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యాన ఇండియా వేదిక నడుస్తోంది. ఈ క్రమంలో టిడిపి, కాంగ్రెస్ పొత్తు నెరవేరాలంటే కచ్చితంగా బిజెపితో అంటకాగుతున్న జనసేనను టిడిపి వదులుకోవాల్సిందే. అయితే అదిజరిగే పరిస్థితులేవీ ప్రస్తుతం కానరావడం లేదు. అదే సందర్భంలో వైసిపితో కాంగ్రెస్ జత కట్టే పరిస్థితీ లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అటు టిడిపి, ఇటు వైసిపికి దూరంగా ఒంటరిపోరు తప్పని పరిస్థితి కన్పిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో ఏలూరు, ఉండి నియోజకవర్గాల్లో మినహా ఎక్కడా బరిలోకి దిగే అభ్యర్థులు సైతం కానరావడం లేదు. అయితే గతంలో కాంగ్రెస్ పదవులు చేపట్టి ప్రస్తుతం స్తబ్ధతగా ఉన్న మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు వంటి వారు ఏమైనా రంగంలోకి దిగితే ఎంతోకొంత ఉనికి చాటుకునే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో వైసిపిలో టిక్కెట్లు దక్కని వారు టిడిపి, జనసేన వైపు చూస్తున్నా అక్కడ అవకాశాలు కానరాక తిరుగుబావుటా ఎగరవేయడానికి కొంత సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో షర్మిల రాకతో వారంతా తాము వైఎస్ అనుచరులమని చెప్పుకుంటూ కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం ఉందనే వాదన విన్పిస్తోంది. ఏదైమైనా జిల్లాలో జనాల్లో ప్రభావం చూపే కాంగ్రెస్ నేతలెవరా అనే చర్చ పలుచోట్ల సాగుతోంది. ఏదేమైనా రెండు జిల్లాల్లో కాంగ్రెస్‌కు వచ్చే ఓట్ల శాతం ఎలాగున్నా.. అసలు పోటీలో ఉంటుందా, గతంలానే చతికిలపడి ఉంటుందా అనేది నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే నాటికిగాని తేలే అవకాశం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

మిస్టర్ ఆంధ్రాగా ఆశిష్

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రథమస్థానం
ముగిసిన చెస్, పాటలు, డ్యాన్స్ పోటీలు
కొనసాగుతున్న వాలీబాల్, చెడుగుడు పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతలు

సంక్రాంతి యోజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న చెడుగుడు, వాలీబాల్ పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పోటీలు గత రెండు రోజులుగా మంచి ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. నువ్వా నేనా అంటూ చెడుగుడు టీంలు ఢీకొంటున్నాయి. మంచి రసవత్తరంగా సాగుతున్న ఈ ఆటల మధ్యలో ప్రేక్షకుల ఈలలతో ఊపొందుకుంటున్నాయి. ఇక ఇంతకు రెట్టింపు ఉత్సాహంతో సాగుతున్నాయి వాలీబాల్ పోటీలు. ఇక్కడ క్రీడాభిమానుల ఉత్సాహం క్రీడాకారులకు మంచి ఊపునిస్తోంది. కాగా ప్రతి సంవత్సరం జరిగే ఈ పోటీల్లో మొదటి రోజు సాధారణంగా సాయంత్రం ఐదు గంటలకు పోటీలు ముగిస్తారు. అయితే ఈ సంవత్సరం చెడుగుడు పోటీల్లో ఊహించిన దానికన్నా రెట్టింపు టీమ్‌లు పోటీలో పాల్గొన్నాయి. మొత్తం 16 టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. వీటిలో కనుమ రోజు మంగళవారం రాత్రి వరకు సుమారు 14 టీంలకు పోటీలు జరిగాయి. మరో రెండు టీములు పోటీలు జరిగితే అక్కడి వరకు నాకౌట్ పోటీలు పూర్తవుతాయి. వీటిలో గెలుపొందిన ఏడు టీంలు లీగ్‌లోకి వస్తాయి. లీగ్ పోటీలు బుధవారం జరగనున్నాయి. బుధవారం రాత్రి ఫ్లడ్‌లైట్స్ వెలుతురులో పోటీలు నిర్వహించి అంతిమ ఫలితాలతో విజేతలను నిర్ణయిస్తారు. ఇక వాలీబాల్‌లో 27 టీములు పాల్గొన్నాయి. వీటిలో మొదటి నాలుగు టీమ్‌లకు లీగ్ పోటీలు బుధవారం జరుగుతాయి.

ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన ఉండి, భీమవరం, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి క్రికెట్ పోటీల్లో మొత్తం 12 టీమ్‌లు పాల్గొన్నాయి. వాటిలో దుంపగడప న్యూ గ్లాడియర్ టీం ప్రథమ స్థానం గెలుచుకోగా, ఆకివీడుకు చెందిన ఎస్‌జెవై టీం ద్వితీయ బహుమతి గెలుచుకుంది.

సంక్రాంతి పండుగ రోజు జరిగిన చెస్ పోటీల్లో జూనియర్స్, సీనియర్ రెండు విభాగాలుగా నిర్వహించారు. వీటిలో జూనియర్స్‌కు జరిగిన ఆరు పోటీల్లో ప్రథమ స్థానం కావూరి నవదీప్, ద్వితీయ స్థానం బుద్ధన తన్మయి సాధించారు. సీనియర్స్ విభాగంలో మొత్తం పది పోటీలు జరిగాయి. వీటిలో ప్రథమ స్థానం దేవరపల్లి లక్ష్మణరావు, రెండో బహుమతి కావూరి కృష్ణకుమారి గెలుచుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన జిల్లా స్థాయి పాటల పోటీల్లో ఆకివీడుకు చెందిన నెల్లి బాలాదిత్య ప్రథమ స్థానాన్ని, పాలకొల్లుకు చెందిన ప్రసాద్ రెండో బహుమతి గెలుచుకున్నారు. కాగా మండల స్థాయిలో జరిగిన డ్యాన్స్ పోటీల్లో రింగ్ డ్యాన్స్ చేసి ప్రత్యేకంగా ఆకట్టుకున్న షైనీ ప్రత్యేక బహుమతి గెలుచుకుంది. కాగా రాష్ట్రస్థాయిలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన బి.ఆశిష్ ప్రథమ స్థానం గెలుచుకుని మిస్టర్ ఆంధ్రాగా నిలిచాడు. కృష్ణా జిల్లాకు చెందిన ఎ.రాజేష్ రెండో బహుమతి, ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన గిరీష్ మూడో స్థానం గెలుచుకున్నారు.

పండుగనాడూ నిరసనల హోరు

36వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 37వ రోజుకు చేరుకుంది. పండుగనాడు అంగన్‌వాడీలు తమ నిరసన తెలిపారు. పలు మండలాల్లో సంతకాలు సేకరించి, పిండి వంటలు చేసి, గడ్డితింటూ నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వీరవాసరంలో...

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అంగన్‌వాడీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతారత్నం, సావిత్రి, వెంకటలక్ష్మి, శాంతకుమారి, ప్రసన్న పాల్గొన్నారు.

గుండెపోటుకు గురైన అంగన్‌వాడీ

ఉద్యోగం తీసేస్తామని బేతపూడి పంచాయతీ నడిపెల్లి అంగన్‌వాడీ చిట్టి మరియమ్మకు ప్రభుత్వం నుంచి మెసేజులు రావడంతో ఆమె సోమవారం సాయంత్రం గుండెపోటుకు గురైంది. దీంతో ఆమెను ఆసుపత్రిలో జాయిన్ చేశారు. అంగన్వాడీలు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆంజనేయులు, మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లారు. మరియమ్మను ఐసియులో పెట్టారని, ఎవరూ లోపలికి వెళ్లకూడదని చెప్పడంతో ఆమె కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. ఉద్యోగాల్లో జాయిన్ అవ్వకపోతే తీసేస్తామని బెదిరింపు మెసేజుజు రావడంతో ఆందోళనకు గురై గుండెపోటు వచ్చిందని మరియమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలన్నారు.

వీరవాసరం : వీరవాసరంలో అంగన్‌వాడీలు మంత్రుల మాస్కుల ధరించిన కొంతమంది ఒకవైపు ఉండి మరోవైపు కొంతమంది తాడు లాగే ఆట ఆడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.నాగరత్నం, సత్యవతి, నిర్మల, లక్ష్మి, వై.వెంకటలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంటలో అంగన్వాడీలు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆచంట కచేరి సెంటర్‌లో సిఎం డౌన్ డౌన్, ఎస్మా చట్టాని తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, అంగన్వాడీలు మైలే విజయలక్ష్మి, పద్మ, నాగలక్ష్మి, సుజాత, ఝాన్సీ, సత్యవతి, వెంకటలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

ఆచంట (పెను మంట్ర) : పెనుమంట్ర తహాశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్ద సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ మండల కార్యదర్శి వి.సరస్వతి, అంగన్వాడీ అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, సాయి మహాలక్ష్మి, మౌనిక, పద్మవతి, ఎల్‌టిడి భవాని, వి.భవాని, రాజేశ్వరి, అక్షిత, చంద్రకళ, శాంతికుమారి పాల్గొన్నారు. అంగన్వాడీ సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు సంఘీభావం తెలిపారు.

గణపవరం : గణపవరంలో అంగన్‌వాడీలు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి, కెవి.సీతామహాలక్ష్మి, కళావతి, జ్యోతి పాల్గొన్నారు.

పోడూరు : పోడూరు అంగన్‌వాడీలు దీక్ష శిబిరం వద్ద పిండి వంటలు చేసి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి పాల్గొన్నారు.

అత్తిలి : అత్తిలిలో అంగన్‌వాడీలు సంతకాలు సేకరించారు. యుటిఎఫ్ నాయకులు ఈశ్వర్ మాస్టర్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్, మండలంలోని కార్యకర్తలు, సహాయకులు డి.నర్సవేణి, సిహెచ్.సత్యవతి, నయోమితేజకుమారి పాల్గొన్నారు.

ఉండి : ఉండి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె మంగళవారం 37వ రోజు కొనసాగింది. అంగన్వాడీలు కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ తమకు వేతనాలు పెంచి ఎస్మా జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

భీమవరంలో...

ఉండిలో...

అత్తిలిలో...

ఆచంటలో...

గణపవరంలో...

పోడూరులో...

కెనాల్ మరమ్మతులు చేయరూ..!

పంట కాలువలోకి నీరు పూర్తిస్థాయిలో వస్తే గండి పడే ప్రమాదం
నిధులు మంజూరైనా పట్టించుకోని అధికారులు
ఆవేదనలో రైతులు

ప్రజాశక్తి - గణపవరం

వరదరాజపురం వాటర్ ట్యాంక్ రోడ్డులో ఉన్న పంట కాలవ నీరు పొంగి రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. దీంతో తమ పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. కెనాల్ మరమ్మతుల కోసం నిధులు మంజూరైనప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేసి కెనాల్ మరమ్మతులు చేయలేదని రైతులు విమర్శిస్తున్నారు. తమ పొలాలకు వెళ్లడానికి వీలుగా ఉండే కాలువ గట్టు రోడ్డు బలహీనంగా ఉందని వాపోతున్నారు. కాలవలోకి నీరు పూర్తిస్థాయిలో వస్తే కాలువ గట్లు గండిపడి తమ పొలాలు మునిగిపోయే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్ మరమ్మతుల కోసం మార్కెట్ యార్డ్ ద్వారా మంజూరైన నిధులు ఏమయ్యాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. వరదరాజపురం కెనాల్ మరమ్మతులు చేయకపోతే ఆందోళన చేపడతామని రైతులు చెబుతున్నారు.

నీట మునిగిన రోడ్డులో గడ్డి మోపులతో నడుచుకుంటూ వెళ్తున్న రైతులు

పాలకొల్లు రైల్వేస్టేషన్ వద్ద కిక్కిరిసి ఉన్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలో తిప్పలు

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు ఆనందంతో విచ్చేసిన ప్రజలు తిరిగి వారి ఉద్యోగ, ఉపాధి కేంద్రాలకు వెళ్లడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. రైల్వే రిజర్వేషన్ 120 రోజుల ముందు, ఆర్‌టిసి రిజర్వేషన్లు 30 రోజుల ముందే బుక్ అయిపోయాయి. దీంతో ప్రయివేట్ ట్రావెల్స్, ప్రత్యేక రైళ్లపై ఎక్కువ మంది ఆధారపడ్డారు. ఎన్ని బస్సులు వేసినా టిక్కెట్లు దొరకని పరిస్థితి ఉంది. మూడు రోజులు పండుగ అనంతరం మంగళవారం బయలుదేరాల్సిన ఉద్యోగులు ప్రయివేట్ బస్సుల్లో రూ.వేలు పోసి టికెట్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాలకొల్లులోని బస్టాండ్, రైల్వేస్టేషన్ కిక్కిరిశాయి. సామాన్య ప్రజలు ఇంత ధర పెట్టుకుని కొనుగోలు చేయలేక రైళ్లలో జనరల్ భోగీల్లో కిక్కిరిసి వెళ్తున్నారు. ఈ ఆదివారం వరకు టిక్కెట్లు దొరకని పరిస్థితి ఉంది. ఈ నెల 21 ఆదివారానికి కూడా నేటి పరిస్థితి వలె టిక్కెట్లకు ఎక్కువ డిమాండ్ ఉంది.

పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండి

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని వాండ్రం గ్రామంలో గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి పలు ప్రాంతాల్లో ఉంటున్న తమ గ్రామానికి చెందిన పట్టభద్రులను ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా సన్మానిస్తున్నామన్నారు. అనంతరం పట్టభద్రులు మాట్లాడుతూ తాము బయటి ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ తమను గుర్తించి ప్రతి సంవత్సరం సన్మానిస్తున్న గ్రామ సర్పంచి దాసరి వెంకటఖృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పట్టబద్రులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు రెడ్డిపల్లి సత్యనారాయణ, యాడంగి ఏసు, ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, పెన్మెత్స కృష్ణంరాజు, ఉప సర్పంచి శ్యామ్ స్వరూప, రోడ్లు భవనాల శాఖ డిఇ వర్మ పాల్గొన్నారు.


తెలంగాణ మాజీ ఎంఎల్ఎలు

కాళ్లకూరు వెంకన్న సన్నిధిలో తెలంగాణ మాజీ ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరులో స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామిని తెలంగాణ మాజీ ఎంఎల్ఎలు ఏనుగు రవీంద్రరెడ్డి, తీగల కృష్ణారెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్ వారిని సత్కరించారు. ఏనుగు రవీంద్రరెడ్డి సతీమణి మంజునాథ్ రెడ్డి, దేవస్థాన మాజీ ఛైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, దంతులూరి శ్రీనివాసరాజు ఉన్నారు.

ప్రభల తీర్థానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ సందర్భంగా కందరవల్లి శివారు తీర్థాల పుంతలో మంగళవారం ప్రభలతీర్థం ఘనంగా నిర్వహించారు. కనుమ రోజున ఇక్కడ ప్రభల తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఎప్పటి మాదిరిగానే వల్లూరు కరుగోరిమిల్లి, కందరవల్లి, వల్లూరు ఉత్తర పాలెం, పెనుమంచిలి నుంచి స్వామివారి ప్రభల తీర్థానికి తరలివచ్చాయి. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభలను మోసేందుకు యువత పోటీపడ్డారు. గతేడాది కంటే యాత్రికులు అధిక సంఖ్యలో తీర్థానికి విచ్చేయడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ఆచంట ఎస్ఐ రాజకుమార్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శేషమ్మచెరువులో అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ సందర్భంగా శేషమ్మ చెరువు శివారు పెళ్లి కూతురమ్మ చెరువులో మూడు రోజుల పాటు పెళ్లి కూతురమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భోగి పండుగ రోజున ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కనుమ రోజున ఆలయం వద్ద జరిగిన తిరునాళ్లకు యాత్రికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో తెలంగాణ మాజీ ఎంఎల్ఎల పర్యటన

ప్రజాశక్తి - కాళ్ల

తెలంగాణ మాజీ ఎంఎల్ఎలు ఏనుగు రవీంద్రరెడ్డి, తీగల కృష్ణారెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగ సందర్భంగా జువ్వలపాలెం గ్రామం విచ్చేశారు. కాళ్లకూరు, జువ్వలపాలెం గ్రామాల్లో చేపలు, రొయ్యల సాగు పరిస్థితిని పరిశీలించారు. ఆక్వా సాగు పరిస్థితిని తెలుసుకుని తెలంగాణలో ఈ సాగు చేపట్టే యోచనలో ఉన్నట్లు వారు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

యువతిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన యువతిపై అదే గ్రామానికి చెందిన కొనతం సుబ్బయ్యదాసు మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబ్బయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పులూరు గ్రామానికి చెందిన యువతి యర్రా కోమలి పదో తరగతి చదివే సమయంలో కొనతం సుబ్బయ్యదాసు వద్ద ప్రయివేటుకు వెళ్లేది. ఆ సమయంలో అవివాహితుడైన సుబ్బయ్యదాసు(42) కోమలిని ప్రేమిస్తున్నానని వేధించేవాడు. దీంతో పెద్దల సమక్షంలో కోమలి బంధువులు సుబ్బయ్య దాసును మందలించారు. అనంతరం కోమలి ఇంజినీరింగ్ నిమిత్తం భీమవరంలోని విష్ణు కళాశాలలో చేరి హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. ప్రస్తుతం సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. ప్రస్తుతం సుబ్బయ్యదాసు చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజారిగా చేస్తున్నాడు. ఈ క్రమంలో సుబ్బయ్యదాసు ఇంటింటికి బియ్యానికి తిరుగుతుండగా కోమలిని చూసి చాకుతో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో కోమలి మెడకు గాయం కావడంతో స్థానికులు ఆమెను భీమవరం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు సుబ్బయ్యదాసుకు దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు దేహశుద్ధి చేయడంతో గాయపడిన సుబ్బయ్యదాసును పోలీసులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుబ్బయ్య దాసుపై కేసు నమోదు చేసినట్లు ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - నరసాపురం

నరసపారంలో రెండు గుండాట స్థావరాలపై పోలీసులు దాడి చేసిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,630 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు కోడిపందేల స్థావరాలపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,850 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సంక్రాంతి సంబరాలు.. ఆటల పోటీలు

నరసాపురంలో...

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలను చైతన్యవంతలను చేసి వారు పోటీ రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగే విధంగా చేయాలన్నదే ఐద్వా లక్ష్యమని సంఘ పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి యువనోత్సవాల్లో భాగంగా ఐద్వా ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. ఐదో పట్టణ అధ్యక్షురాలు డొంకల లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఉదయకుమారి మాట్లాడారు. వంద మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ రంగవల్లుల పోటీల్లో జూనియర్ విభాగంలో ఎం.గీతిక, టి.దేవదర్శి, వై.గౌతమి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. సీనియర్స్ విభాగంలో పి.దేవి, కె.సాయిపద్మశ్రీ, వి.జ్యోతిప్రియదర్శిని బహుమతులు పొందారు. కాగా మ్యూజికల్ చైర్స్ ఆటలో జూనియర్స్ విభాగంలో ఎస్.జ్ఞానేశ్వరి, దేవి దర్శనీలు మొదటి రెండు బహుమతులు సాధించగా సీనియర్స్ విభాగంలో వరుసగా ప్రవీణకుమారి, కె.సాయిపద్మశ్రీ మొదటి రెండు బహుమతులు సాధించారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

వీరవాసరం : పండుగ పేరుతో జూదాలు మాని సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహిస్తేనే సమాజానికి మేలు జరుగుతుందని ఎస్ఐ రమేష్ తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెర్కిపాలెంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ రమేష్ బహుమతులు అందించారు. మహారాజు, బొక్కా కూర్మారావు, దేనబోయిన ఏసు పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహించారు. కబడ్డీ, పరుగుపందెం, కుండకొట్టు, మ్యూజికల్ ఛైర్స్, ముగ్గుల పోటీలను నిర్వహించారు.

తాడేపల్లిగూడెం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో మహిళలకు ముగ్గులు, కుర్చీలాట బాలబాలికలకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు తమ్మిశెట్టి చుక్కయ్య, ఎంపిటిసి సభ్యులు కౌలూరి వెంకన్న, ఎంపిటిసి ప్రతి రంగయ్య బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పురిటిగడ్డ జయమ్మ, గ్రామ నాయకులు నిచ్చిన కోళ్ల రాముడు, మల్లుల పరమేశు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, ఎస్.చిన్ని, ఆర్.సుమన్, ఆర్.అనూష, ఆర్.ప్రసన్నకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పీల నాయుడు, ప్రకృతి మాణిక్యాలరావు, పి.కోటేశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర మండలం పాలమూరులో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో చిన్నారుల నృత్యప్రదర్శన

దొడ్డనపూడిలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కాళ్ల : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు భాశ్విని ఛారిటబుల్ ట్రస్ట్, భాశ్విని డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో మొదటి స్థానం సాధించిన జట్టుకు బహుమతితో పాటు రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు బహుమతితో పాటు రూ.5వేల నగదును అందించారు.


కాళ్లలో...

నరసాపురం : సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 21వ వార్డు మద్దాలవారివీధిలో సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ సభ్యులు కొత్తపల్లి జానకిరామ్, సిఐటియు నాయకులు పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత చెడు వ్యసనాల వైపు పోకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆటల పోటీలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక 21వ వార్డు ముద్దాలవారివీధిలో కొప్పినీడి జానకి కమలాదేవి జ్ఞాపకార్థంతో బూడిద జోగేశ్వరరావు భువనేశ్వరి దంపతులు ఈ పోటీలు నిర్వహించడం చాలా ఆనందదాయకమన్నారు. అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ముగ్గుల పోటీల్లో 62 మంది పాల్గొనగా మొదటి బహుమతి ఎం.వినయ్‌కుమారి, రెండో బహుమతి మార్త, మూడో బహుమతి వి.దుర్గాభవాని, నాలుగో బహుమతి ఇ.దేవి, ఐదో బహుమతి కె.హారిక సాధించారు. మ్యూజికల్ చైర్స్‌లో బాల బాలికలు, మహిళలు 75 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో తొమ్మిది మంది విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాగశ్రీ, పిచ్చుక లలిత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కొప్పినీడి చిన్న గంగయ్య, సిఐటియు పట్టణ అధ్యక్షులు పొన్నాడ రాము, నల్ల నాగరాజు, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ కనకం వరప్రసాద్, దేశెట్టి సత్యనారాయణ, బల్ల రమేష్, ద్వారా పార్థసారథి, అవనిగడ్డ కృపారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

యలమంచిలి : సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఐద్వా సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా చించినాడ, కలగంపూడి, ఏనుగువానిలంక పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు సరిప జయప్రభ మాట్లాడుతూ చించినాడ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో సైతం గత 30 సంవత్సరాలుగా ఐద్వా ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి సుగుణ, ముస్కాడి జయశ్రీ, సెట్టిమి నాగమణి, బూసి ప్రభావతి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో...

భీమవరం : పట్టణంలో 7, 8, 9, 38వ వార్డుల్లో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. రాంబాబు, కేత శ్రీను, జడ్డి ఏడుకొండలు, మంగ, భద్రమ్మ, రేణుక, సాయమ్మకుమారి, సిహెచ్.వరలక్ష్మి, డి.త్రిమూర్తులు, జయకృష్ణ, ముత్యాల శ్రీను, డి.త్రిమూర్తులు, సిహెచ్.వరలక్ష్మి, కృష్ణ, శ్రీనులు పాటల పోటీలను దగ్గరుండి ఆడించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడిపందేల వంటి వైపు వెళ్లకుండా డివైఎఫ్ఐ ఆటల పోటీలు నిర్వహిస్తుందని తెలిపారు. ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రమేష్, శ్రీను, సింగు అనసూయమ్మ, సత్యవతి, మణి పాల్గొన్నారు.

వీరవాసరంలో...

యలమంచిలిలో..

ముగిసిన బ్యాడ్మింటన్, రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

అమ్మవారి జాతరను పురష్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమనిప్రజా ప్రతినిధులు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో ఉన్న మొగదారమ్మ జాతరను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామి నేచురల్స్ అధినేత చౌదుల రాజు తల్లి చౌదుల ధనలక్ష్మి జ్ఞాపకార్థం గత వారం రోజులుగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సోమవారం సాయంత్రం మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినవారికి చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తిరుమని విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, సత్తినేని గజేంద్రుడు, పోతుల ఏసుబాబు పాల్గొన్నారు.

తిరునాళ్లలో ఆకతాయిల అల్లర్లు

చర్యలు తీసుకోవాలని కోరుతున్న మహిళలు

ప్రజాశక్తి - నరసాపురం

చర్చి రోడ్డులో జరుగుతున్న వనువులమ్మ తిరునాళ్లలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు చుట్టు పక్కల నుంచి పెద్దఎత్తున ప్రజలు విచ్చేస్తున్నారు. ఈ జాతరలో మహిళలు, యువతుల వెనుక ఆకతాయిలు వెళ్తూ ప్లాస్టిక్ బూరలతో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ వెకిలి చేష్టలు చేస్తున్నారు. పోలీసులు ఉన్నపటికీ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు సరిపోతున్నారు. దీంతో ఆకతాయిలు అవకాశంగా చేసుకుని చెలరేగిపోతున్నారు. ఎక్కువ మొత్తంలో పోలీసులను, స్పెషల్ పార్టీ పోలీసులను జాతరలో కూడా పలు ప్రాంతాల్లో కూడలిలో ఏర్పాటు చేసి ఆకతాయిల ఆట కట్టించాలని మహిళలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!

కోతకు గురైన రహదారి
ప్రమాదకరంగా బండిరేవు ప్రాంతం
భయాందోళనలో వాహనదారులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పశ్చిమ కాలువ వెంబడి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వీరవాసరం బండి రేవు వద్ద రహదారి కోతకు గురైంది. ఆదమరిచి పక్కకు వెళ్తే ప్రమాదం తప్పదన్న విధంగా అక్కడ రోడ్డు మార్జిన్ వెంబడి పరిస్థితి ఉంది. కొన్నేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి పునరావృతమవుతూ వస్తుంది. అయినప్పటికీ పటిష్టమైన పరిస్థితులు తీసుకోలేదు. ఇక్కడ నిత్యం పశువులను కాలువలోకి దింపే క్రమంలో రోడ్డు మార్జిన్ కోతకు గురవుతుంది. ఈ మార్గం గుండా బాలేపల్లి, మెంటేపూడి గ్రామాలకు చెందిన గ్రామస్తులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మార్జిన్ కోత రోడ్డుకు సమాంతరంగా ఉండటం వల్ల ఆ ప్రదేశానికి వచ్చే వరకు కనిపించని పరిస్థితి ఉంది. దీంతో ఎదరెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో ఆ ప్రదేశంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారుల ఈ ప్రమాదకర పరిస్థితుల తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపి కంటే బ్రిటిష్ విధానాలే బాగుండేవేమో

క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ప్రభుత్వం విధానాల కంటే బ్రిటిష్ ప్రభుత్వం విధానాలే బాగుండేవేమోనని ప్రస్తుత పరిస్థితుల్లో అనిపిస్తుందని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన లూథర్‌ఫర్డ్ ఎవరైనా తప్పు చేస్తే ఉద్యోగం నుంచి తొలగించి శిక్ష వేసేవారని, కాని వైసిపి ప్రభుత్వం మాత్రం ఏ తప్పు చేయకపోయినా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చాలు అక్రమ కేసులు, నిర్బంధాలు చేస్తుందని విమర్శించారు. మండలంలోని కుమదవల్లి గ్రామంలో క్షత్రియుల 5వ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణమరాజు, రవికుమార్‌రాజు, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, కలిదిండి రామచంద్రరాజు, అనంతరాజు, నాగేంద్రవర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలో నలుమూలల ఉన్న క్షత్రియులంతా కుటుంబ సభ్యులతో తరలివచ్చి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఆట పాటలు, డాన్సులతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు మాట్లాడారు. సంక్రాంతి పండుగకు అంతా ఒకేచోట ఆత్మీయంగా కలుసుకోవడం అభినందనీయమన్నారు. ఐదేళ్లకొకసారి సమ్మేళనం కాకుండా మధ్యలో కలుసుకోవడం ద్వారా స్నేహాలు మరింత బలపడతాయన్నారు. సంక్రాంతికి ఢిల్లీ నుంచి సొంత గ్రామమైన భీమవరం రావడం ఆనందంగా ఉందని, కుముదవల్లి వచ్చి మీరందరినీ కలుసుకోవడం జీవితంలో మర్చిపోలేనన్నారు. అనంతరం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, స్వతంత్ర ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన క్షత్రియ ఉద్యమకారులు, యోధుల చరిత్రలను వివరిస్తూ చిత్రీకరించిన పలు షార్ట్ ఫిలింలను విడుదల చేశారు. చిన్నారులతో లక్కీ డిప్ నిర్వహించి సెల్‌ఫోన్లు, గృహోపకరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ మెట్రో రైలు, ముంబై వాటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలింగరాజు, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత త్రిమూర్తులు

చంద్రబాబుపై కేసు కొట్టేయలంటూ పూజలు

భీమవరం రూరల్ : టిడిపి అధినేత చంద్రబాబుపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సుప్రీంలో వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్ కొట్టేయాలంటూ భీమవరంలో టిడిపి నాయకులు పూజలు నిర్వహించారు. శ్రీనివాస్ థియేటర్ సెంటర్‌లోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతులచే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా త్రిమూర్తులు, మద్దుల రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాసరావు, విన్నకోట వినాయక్, మద్దుల మావుళ్లు, దొంగ వెంకటేశ్వరరావు, మాదాసు కనకదుర్గ, నేదునూరి గంగాధర్, కాపా అమర్‌బాబు, తిప్పా బాలముత్యం, వైఎన్‌వి.కృష్ణ, బొత్స వెంకటరమణ, తేజ పాల్గొన్నారు.

వసూళ్ల సంక్రాంతి

ఒక్కో బరి నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
కనీస రక్షణ చర్యలు పాటించని నిర్వాహకులు
పాలకోడేరులో 14 మందికి కోడికత్తి గాయాలు

ప్రజాశక్తి - భీమవరం

సంక్రాంతి పండుగ అంటే మన సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా చెబుతూ ఉంటాం. కానీ ఈ ఏడాది సంక్రాంతి పండుగ అంటే వసూళ్లకు పండగగా కొందరు పోలీసులకు, అధికారులకు వరంగా మారింది. కోడిపందేలు, గుండాట, పేకాట, కోతాట వంటి జూదాలపై ఉన్న నిషేధాన్ని అవకాశంగా చేసుకుని ఒక్కో కోడిపందేల బరి నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారు. ఈ వసూళ్లు కొన్నిచోట్ల రోజుల లెక్క ఉంటే, మరికొన్నిచోట్ల మూడు రోజులకు, ఇంకొన్నిచోట్ల పందెం బరులు, గుండాట, పేకాట వంటి వాటి నిర్వహణ సామర్థ్యాన్ని బట్టి ధరలను నిర్ణయించారు. జిల్లాలో ఈ ఏడాది కోడిపందేలు భోగి రోజు ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఎక్కడ ఎటువంటి ఆంక్షలు లేకుండా పందేలను మూడు రోజుల పాటు పగలు, రాత్రి తేడా లేకుండా నిర్వహించారు. భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం వంటి మండలాల్లో ఈ కోడిపందేలు జోరుగా సాగాయి. కొన్ని భారీ బరుల్లో రూ.కోట్లు చేతులు మారాయి. పాలకోడేరు మండలంలో జరిగిన పందేల బరుల్లో పలువురికి కోడి కత్తుల గాయలయ్యాయి. ఒక్క పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 14 మందికి కోడి కత్తి గాయాలతో వచ్చిన వారికి ప్రమాదకర స్థితిలో వైద్యం చేశారు. బరుల నిర్వాహకుల నిర్లక్ష్యం, అసమర్థత వల్ల పందెంబరుల్లో ఎక్కడికక్కడ సోమ, మంగళవారాల్లో పలు ఘర్షణలు చోటు చేసుకోవడంతో మరో నలుగురు గాయపడ్డారు. మరో పక్క నిర్వాహకులు పందేల సందర్భంగా సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కోడి కత్తులు గుచ్చుకుని పలువురు గాయపడ్డారు. కుముదవల్లికి చెందిన ఒక ఆటో డ్రైవరుకు తొడ వద్ద కోడి కత్తి తగిలి తీవ్ర గాయమైంది. సరదాగా పందేలు తిలకించేందుకు వచ్చి ఇలా గాయాలుపాలవ్వడంతో బాధితుల ఇంట విషాదం నెలకొంది. పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వివాదాస్పదంగా ఉండే పందాల బరులపై గట్టి నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పందేలను నిలుపుదల చేయాలని సూచించారు. ఈ ఆదేశాలను అమలు చేయడంలో క్షేత్రస్థాయిలో ఉన్న పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇటువంటి ఘర్షణలు చోటు చేసుకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోడి కత్త తగిలి గాయాలపాలైన ఆటో డ్రైవర్

IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT HANUMAKONDA

O.S. No. 3277 OF 2022

Between:
Ganta Nageshwar Rao ... Plaintiff
AND
Yadlapalli V.V. Siva Kumar & another ...Defendants

NOTICE

To
D1) Yadlapalli V.V. Siva Kumar, S/o. Sriramulu, Age: 43 years, Occ: Pvt. Employee, H.No. 9-148, Flat No. G-1, Balaji's Sai Maruthi Residence, Srinivas Nagar Colony, Nizampet, Hyderabad (or) C/o. P. Surya Chander Rao, S/o. Subba Rao, Age: 47 years, Occ: Business, R/o. H.No. 10-30-11/2, Near Jayalaxmi Theater, Bhagyalaxmipet, Tadepalligudem, West Godavari District, Andhra Pradesh State.

OOO

Whereas the above named plaintiff has instituted the above numbered suit against you and another for recovery of money. As you have avoiding the summons having the knowledge of suit proceedings the Hon'ble Court ordered summons through publication. Please take notice that the suit is posted on 07-02-2024 at 10:30 am for your appearance. So you are hereby summoned to appear in the above court on the above said date in person or through an advocate to answer the claim, otherwise the matter will be heard and decided in your absence.

(BY THE ORDER OF THE COURT)

Sd/-
Ennamsetti Venugopal Rao,
Advocate for the Petitioner
H.No. 4-7-131, Kumarpally,
Hanamkonda, Warangal Dist.
Date: 9-1-2024
Place: Hanumakonda